ప్రజాశక్తి
సోమవారం 30 సెప్టెంబరు, 2024
5
శ్రీకాకుళం



నదులను అనుసంధానం చేయాలి

టెక్కలి: రాష్ట్ర విభజన నేపథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాలకులు చేసిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే నదులను అనుసంధానం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టుపాటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో 'ఉత్తరాంధ్ర వెనుకుబాటు – పాలకుల నిర్లక్ష్యం' అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం నుంచి సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రాకు సాగు నీరు అందించాలన్నారు. వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకు పొడిగించాలన్నారు. మత్స్యకారులకు అవసరమైన కోల్డ్‌స్టోరేజ్‌లను నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వంకల మాదవరావు మాట్లాడు తూ ఆఫ్‌షోర్ రిజర్వాయరును తక్షణమే పూర్తి చేయాల న్నారు. సదస్సుకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.జగన్నాథం, జుద్వేరాస్వామి, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ, బంగ్లాకుమార్, పిడిఎస్‌యు నాయకులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి గొప్ప దార్శనికుడు

సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

కమ్యూనిస్టు ఉద్యమ సారథి సీతారాం ఏచూరి గొప్ప దార్శనికుడని పలువురు వక్తలు కొనియాడారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ విభజనతో నష్టపోయిన ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిన అవసరముందని నాడు రాజ్యసభలో గట్టిగా తన వాణి వినిపించారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారని, వాటి అభివృద్ధి కోసం పరితపించారని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా, నేటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. సైద్ధాంతికంగా విరుద్ధమైన భావజాలం కలిగిన మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బిజెపి జాతీయాధ్యక్షుడు జెపి నడ్డా సైతం ఏచూరి మరణంపై బాధపడ్డారంటే అంతటి ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. వ్యక్తిగా కంటే సిపిఎం కార్యకర్తగా, నాయకునిగా ఆయన ఇది సాధించగలిగారని చెప్పారు. ఢిల్లీలోని జెఎన్‌టియులో చేరిన తర్వాత ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పరిపూర్ణమైన నాయకత్వం వహించడం వల్లే ఏచూరి ఈ స్థాయికి చేరుకున్నారని విద్యార్థులు, యువత దీన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మతతత్వ శక్తులు, పెట్టుబడిదారుల బంధాన్ని విడగొట్టేందుకు ఐక్యంగా పనిచేయడమే ఏచూరికి ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఏచూరి ఆశించిన దేశ సార్వభౌమత్వం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, లౌకికవాదం పరిరక్షణ కోసం ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో కలిసి ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మత ఘర్షణలను అణచివేసి మతసామరస్యం, వాటి సంప్రదాయాలను నాడు ఎన్‌టిఆర్ గౌరవించారని, మైనార్టీల పక్షాన నాడు వైఎస్సార్ నిలబడ్డారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు చంద్రబాబు, జగన్ పార్టీలు మతతత్వ శక్తులకు ఊతమిచ్చేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తిరుమల లడ్డూ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు సిట్ విచారణ చేస్తోందని, మరోవైపు సుప్రీం కోర్టు కూడా విచారించనుందని తొందరపాటు ఎందుకని ప్రశ్నించారు. ఈ నెపంతో టిటిడిని హైజాక్ చేసి తన ఆధీనంలోకి తీసుకోవాలని చూస్తోందని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం ఉపయోగపడే టిటిడిని తరలించే కుట్రలు, కుతంత్రాలను గమనించి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పేడాడ పరమేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, విదేశీ విధానాలు దేశానికి ఏవిధంగా నష్టం కలిగిస్తాయో ముందుగానే హెచ్చరించిన దార్శనికుడు ఏచూరి అని కొనియాడారు. పార్టీ సిద్ధాంతాలకు లోబడే రాజకీయ పక్షాల నాయకులతో సన్నిహిత సంబంధాలు నెరపారని చెప్పారు.

జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి దేశంలో ఉన్న సామాజిక అంతరాలపై అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే కర్తవ్యాన్ని యువత తీసుకోవాలన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకట రమణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏచూరి మరణించడం దేశానికి తీరని లోటన్నారు.

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు మాట్లాడుతూ కార్మికవర్గం, పీడిత ప్రజానీకం కోసం పనిచేసిన ఏచూరి మరణం బాధాకరమన్నారు. మతోన్మాదం, ఆర్ఎస్ఎస్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలంటే అంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందన్నారు. సిపిఐ(ఎంఎల్) నాయకులు తాండ్ర అరుణ మాట్లాడుతూ ఏచూరి ఆశయాలను నెరవేర్చేందుకు అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో రెడ్డీస్ లేబొరేటరీస్ కార్మికుల సమ్మె సందర్భంగా జిల్లాకు వచ్చి ఆయన సంఘీభావం ప్రకటించిన 24 గంటల్లో సమస్య పరిష్కారమైందన్నారు. శ్రమజీవుల పక్షాన ఏవిధంగా నిలబడతారో ఇది ఒక ఉదాహరణ అని చెప్పారు.

సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పీడిత వర్గాల తరుపున పోరాడిన వారిలో ఏచూరి చురుకైన పాత్ర పోషించారని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ పీడిత ప్రజలు, కార్మికవర్గానికి తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నేత ఏచూరి అని కొనియాడారు. ఉపాధి చట్టం, అటవీహక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ సంతాప సందేశాన్ని జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకరరావు వినిపించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు సిహెచ్.రామచంద్రరావు, ఎస్.శ్రీనివాసులు ఏచూరిని స్మరిస్తూ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఏచూరి జీవిత చరిత్రపై ప్రచురించిన ప్రత్యేక సంచికను వక్తలు ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్



యోగాసనాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

యోగాతో మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి – శ్రీకాకుళం

యోగాను నిత్యం సాధన చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల జూబ్లీహాల్‌లో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి యోగా పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ యోగా సాధన చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుందని తెలిపారు. ధ్యానం, శ్వాస మీద ధ్యాస లాంటి వాటి వల్ల మానసిక ప్రశాంతతా చేకూరుతుందని చెప్పారు. యోగాను స్పోర్ట్స్ కోటాలో కూడా చేర్చడం జరిగిందని, విద్యార్థులు యోగాపై మక్కువతో అభ్యసన చేయాలని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ కేదారనాథ్, జాయింట్ సెక్రటరీ జి.అర్చన, గురుగుబెల్లి జీవిత, ఉపాధ్యక్షులు తంగి స్వాతి, కొంక్యాన మురళీధర్, కోశాధికారి శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హర్షకుమార్

వర్గీకరణతో అన్యాయం

మాజీ ఎంపీ జి.వి హర్షకుమార్

ప్రజాశక్తి – టెక్కలి

ఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్ కోటాలో మార్పులు చేస్తూ వర్గీకరణ చేసుకునేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దళితులకు అన్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ జి.వి హర్షకుమార్ అన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యాన స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో 'ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్ వర్గీకరణ–క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణ' అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు దళితులను వంచన చేశాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న దళితుల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు వారి సమస్యలపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజ్యాధికారంతోనే దళితుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. దళితులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని, దీనిపై సుప్రీంకోర్టు ఎలా తీర్పు ఇస్తుందన్నారు. 342 ఆర్టికల్‌ను మార్చి రాజ్యాంగ సవరణ చేశారా అని ప్రశ్నించారు. వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్రం నుంచి 34 మంది రివ్యూ పిటిషన్లు వేశారని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే దళితులకు అన్యాయం ప్రారంభమైందని తర్వాత వచ్చిన పాలకులు వాటిని కొనసాగిస్తూ మరింత పటిష్టం చేస్తున్నారని విమర్శించారు. దళితులకు అందాల్సిన పలు సంక్షేమ పథకాలనూ రద్దు చేశారని చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

మాల మహానాడు వ్యవస్థాపకులు కె.బి.ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ 59 ఉప కులాలుగా ఉన్న దళితులు రాజకీయంగా ఎదగాలన్నారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి తిరుపతి లడ్డూపై పాలకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ ఎన్.భరత్‌భూషణ్ మాట్లాడుతూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పాలకులు స్వప్రయోజనం కోసం చూస్తున్నారని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ బోకర నారాయణరావు, చల్లా రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టెక్కలి ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సినీ నిర్మాత బలగ ప్రకాష్, కురమాన దాలయ్య, కుప్పిలి కామేశ్వరరావు, దూసి ఆంధ్రాస్టాలిన్, దేబారికి రామప్పడు, పెయ్యిల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ప్రశ్న కీలకం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

సమాజ అభివృద్ధిలో ప్రశ్న కీలకమైందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కీ.శే కె.రామలక్ష్మి 6వ సంస్మరణ సభను ఆ సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబురావు అధ్యక్షతన 'చైతన్యం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రశ్నించడం, చైతన్యవంతంగా ఆలోచించడం మనిషి సహజమైన లక్షణమని, దాన్ని కోల్పోకుండా నిరంతరం కొనసాగించడం ద్వారానే సమాజంలో ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథాలు, ఉత్పత్తులతో సమాజ అభివృద్ధి జరిగిందన్నారు. వ్యక్తిగత చైతన్యం సంఘ చైతన్యంగా మార్చుకోవాలని, సంఘ చైతన్యం సామాజిక చైతన్యంగా అభివృద్ధి చేసుకోవడం ద్వారా వర్గ చైతన్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. శ్వాస మీద ధ్యాస ఉంచే వాళ్ల కంటే, శ్రమ మీద ధ్యాస ఉంచే వారి సంఖ్య పెరగాలని, అదే సమాజానికి ఉపయోగమని తెలిపారు.. రుగ్మతలు లేని సమాజం కోసం అందరం కృషి చేయడమే రామలక్ష్మికి ఇచ్చే ఘన నివాళి అని అన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఆదర్శ భావాలు వెలసిల్లాయని, ఆ సందర్భంలోనే ఆదర్శ వివాహాలు, భావాలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో మతోన్మాద శక్తులు అశాస్త్రీయమైన అంశాల్ని సమాజంలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అభ్యుదయ భావాలను తిరిగి అభివృద్ధి చేసే ప్రయత్నం చేయాలన్నారు. పురుషాధిక్యత, కుల, మత ఉన్మాదాలు నేటి సమాజంలో అంగీకరిస్తామా? సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తామా? అని ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ రామలక్ష్మిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వ విద్యను కాపాడుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేయాలన్నారు. రామలక్ష్మి భర్త, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు మాట్లాడుతూ రామలక్ష్మి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రామలక్ష్మి రాసిన 'నేనొక కవిత్వం' పుస్తకాన్ని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు ఎ.అప్పలనాయుడు ఆవిష్కరించారు. కవి, కథా రచయిత చింతాడ తిరుపతిరావు పుస్తకంపై సమీక్ష చేశారు. సభలో సిక్కోలు ట్రస్టు ప్రతినిధి డి.రవికుమార్, సాహితీ స్రవంతి కన్వీనర్ శ్రీనివాసు, రచయితలు సిద్ధార్థ, రామారావు, గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం వాగ్దేవి, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, తదితరులు

రైతులకు సేవ చేసే అవకాశం దక్కింది

వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్

శ్రీకాకుళం అర్బన్: వ్యవసాయశాఖలో పనిచేయడం ద్వారా రైతులకు సేవ చేసే అవకాశం లభించిందని ఆ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ అన్నారు. జిల్లాలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేయడం ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చిందని చెప్పారు. నగరంలోని ఒక హోటల్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయన ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 34 ఏళ్ల సర్వీసులో పనిచేసిన అన్నిచోట్లా ఎంతోమంది ఆప్తులను పోగు చేసుకోగలిగానన్నారు. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడంలో తనకు వెన్నుదన్నుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వాటర్‌షెడ్‌లో మంచి కార్యక్రమాలు చేయడం, గిరిజనులతో మమేకమై ఐటిడిఎలో పనిచేయడం, ఔత్సాహిక రైతులతో అనేక రాష్ట్రాలు తిరగడం, వ్యవసాయంలో కొత్త కొత్త విషయాలు నేర్చుకోవడం ఇవన్నీ మంచి అనుభూతులను మిగిల్చాయన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో పనిచేసిన విషయాలను పంచుకున్నారు. తన భార్య, కుటుంబసభ్యుల సహకారం మరువలేనివని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ శాఖల ఉద్యోగులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం సంతోషకరంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్లు రామరాజు, వేణుగోపాల్, వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్త సత్యనారాయణ, హార్టికల్చర్, సెరికల్చర్ ఎడిలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, ఉపసంచాలకులు పాల్గొన్నారు.



సత్కారాన్ని అందుకుంటున్న శ్రీధర్



నినాదాలు చేస్తున్న ఎండిఎం కార్మికులు

2న ఎండిఎం రాష్ట్ర సదస్సు

ఇచ్ఛాపురం: మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు రెండో తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం హైస్కూల్ ఆవరణలో సంఘ మండల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక వంట కార్మికులపై వేధింపులు, తొలగింపులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కార్మికులపై వేధింపులకు పాల్పడుతోందని చెప్పారు. 24 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు నిర్దాక్షిణ్యంగా రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారని విమర్శించారు. మానసికంగా వేధిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50వేల మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో ఎక్కువగా ఒంటరి మహిళలే ఉన్నారని చెప్పారు. వీరి ఉపాధికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నా ఎలాంటి ప్రమాద బీమా సౌకర్యం లేదన్నారు. అనేక పాఠశాలల్లో ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవని చెప్పారు. పథకం అమలుకు పాఠశాలలో పిల్లలకు ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటమ్‌తో గత ప్రభుత్వ మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్‌ను సరఫరా చేయాలని, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలైన వంట షెడ్లు మంచినీరు తదితర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. సదస్సులో వంట కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధం కానున్నట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ నాయకులు డి.జమ్మాలు, బి.పార్వతి, ముత్యాలు, హేమలత, లక్ష్మీబెహరాపాల్గొన్నారు.

వ్యాయామంతో హృదయం పదిలం

ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: నడక, వ్యాయామం, యోగా వంటి వాటి ద్వారా హృదయాన్ని పదిలంగా ఉంచుకోవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం ప్రభుత్వ పురుష డిగ్రీ కళాశాల వద్ద సమావేశ అనంతరం అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రిక జీవనం, మానసిక ఒత్తిడి, కనీస వ్యాయామం లేకపోవడం, దురలవాట్లు, ఆహార నియమాలు పాటించకపోవడం గుండె లయ తప్పేలా చేస్తున్నాయని తెలిపారు. చిన్న వయసులోనే హృద్రోగ సమస్యలతో ఆస్పత్రిపాలవుతున్నారని చెప్పారు. అప్పటివరకు ఉత్సాహంగా తిరుగుతూ ఉండే యువత కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతిచెందుతున్న ఘటనలు తీవ్రంగా బాధిస్తున్నాయన్నారు. కనీస జాగ్రత్తలు పాటించడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చని తెలిపారు. ఉదయాన్నే నడక, చిన్నపాటి వ్యాయామాలు చేస్తే గుండెకు ఎంతో మంచిదన్నారు. వ్యాయామంతో పాటు మంచి ఆహారపు అలవాట్లతో గుండె జబ్బులకు చెక్ పెట్టవచ్చని కార్డియాలజిస్టులు సూచిస్తున్నారని వివరించారు. ఎక్కువ కాలం నుంచి షుగర్ ఉన్న వాళ్లు, ఫ్యామిలీ హిస్టరీలో గుండె జబ్బులు ఉన్న వాళ్లు, అధిక కొలెస్ట్రాల్, హైపర్‌టెన్షన్ ఉన్న వాళ్లు ఏడాదికి, రెండేళ్లకు గుండెకు సంబంధించిన పరీక్షలు ముందస్తుగా చేయించుకుని తగిన జాగ్రత్తలు పాటిస్తే హృద్రోగాలకు దూరంగా ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. మిగిలిన వాళ్లు కూడా 40 ఏళ్ల వయసు నుంచి ముందస్తుగా గుండె పరీక్షలు చేయించుకుని గుండె జబ్బులను గుర్తిస్తే సకాలంలో వైద్య సేవలు పొంది రక్షణ పొందవ చ్చని సూచించారు. హృదయ ఆరోగ్యానికి మూలస్తంభం అని సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమలో పాల్గొనడం, పొగాకు వాడకాన్ని నివారించడం, మద్యపానాన్ని పరిమితం చేయడం వంటి సాధారణ జీవనశైలి మార్పుల ద్వారా గుండె జబ్బులను చాలావరకు నివారించ వచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి అధ్యక్షులు వి.జగన్నాథనాయుడు, రోటరీ క్లబ్ అధ్యక్షులు ముని శ్రీనివాసరావు, జెమ్స్ కార్డియోలజిస్టులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

రేపట్నుంచి కొత్తమ్మతల్లి ఉత్సవాలు

పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రజాశక్తి – కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి ఉత్సవాలు అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు మూడో తేదీతో ముగియనున్నాయి. ఏటా ఈ ఉత్సవాలు మహాలయ అమావాస్య తర్వాత వచ్చే గురువారం నాడు ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు జిల్లా, ఉత్తరాంధ్ర ప్రాంతవాసులే కాకుండా తెలంగాణ, ఒడిశా నుంచి యాత్రికులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఈ ఏడాది ఈ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ పండగగా ప్రకటించడంతో అధికార యంత్రాంగం అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయు డు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక టిడిపి నాయకుల పర్యవేక్షణలో గ్రామ పెద్దల సూచనలు, సహాయ సహకారాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ నిర్వహిస్తున్నారు.



విద్యుద్దీపాల వెలుగులో కొత్తమ్మతల్లి ఆలయం

ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు

మూడు రోజులు పాటు నిర్వహించే కొత్తమ్మతల్లి ఉత్సవాలు రాష్ట్రస్థాయి ఉత్సవాలుగా నిర్వహించాలని ప్రభుత్వం అదేశించడంతో ఈ ఏడాది భారీగా ఏర్పాట్లు చేశారు. కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రెండు కిలోమీటర్లు పొడవునా కొత్తపేట వరకు విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. లైటింగ్‌తో కూడిన వెంకటేశ్వర ఆలయం, కొత్తమ్మతల్లి ఆలయం వంటి భారీ కటౌట్లు చూపరులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు వచ్చే వారికి ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. జెయింట్ వీల్, శాలంబో, బ్రేక్ డాన్స్, కారు, మోటార్ సైకిల్ విన్యాసాలు ఆకట్టు కునే విధంగా ఏర్పాటు చేశారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు దేవస్థానం వారు ఉచిత ప్రసాదాల పంపిణీ, ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. యాత్రికులకు వైద్యశాఖ ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తోంది.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే ప్రావీణ్యం పొందిన కబడ్డీ, సంగిడీ రాళ్లు, ఈడ్పురాయి, ఉలవల బస్తాలు పోటీలు 1, 2, 3 తేదీల్లో నిర్వహిస్తారు. పగటి వేషాలు, కోయ నృత్యాలతో పాటు మూడు రోజుల రాత్రులు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు జబర్దస్త్ టీమ్ సందడి చేయనుంది.

భారీ బందోబస్తు

మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. 450 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఎవరైనా ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా 9440795835, 08942 238633 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


ట్రోఫీని అందుకుంటున్న మందస జట్టు

క్రికెట్ టోర్నీ విజేత మందస

ప్రజాశక్తి- మందస

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మందస మండలం జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. తమ సమీప ప్రత్యర్థి కొత్తూరు మండల క్రికెట్ టీమ్‌పై అనూహ్యంగా చివరి ఓవర్‌లో ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించింది. గుంటూరులో అక్టోబరు 4, 5, 6 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి గున్న రమేష్, మందస మండలం ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు తెలిపారు. జిల్లా యుటిఎఫ్ కోశాధికారి రవికుమార్ చేతుల మీదుగా బహుమతి పొందారు. ఫైనల్ మ్యాచ్‌లో మాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కిరణ్‌కుమార్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా సాలిన శ్రీహర్ష ఎంపికయ్యారు. జిల్లాస్థాయి విజయంపై మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


ప్రొక్లెయిన్‌తో ఏర్పాటు చేస్తున్న రహదారి

పంట భూములకు రహదారి ఏర్పాటు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని షేర్ మహమ్మద్ పురంలో 2006లో వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన సాగు డీపట్టా భూములకు ఆదివారం రెవిన్యూ అధికారులు రహదారి మార్గం ఏర్పాటు చేసే చర్యలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన వికలాంగుల గ్రీవెన్స్‌లో పట్టాలు పొందిన వికలాంగులు ఫిర్యాదు చేశారు. తమ భూమికి రహదారి లేదని రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి తక్షమే ఆదేశాలు జారీ చేశారు. తహశీల్దార్ ఎ.సింహాచలం, సర్వేయర్ డి.సుభాష్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి వికలాంగులకు సర్వే నెంబర్ 112లో కేటాయించిన 40 ఎకరాల కొండ పోరంబోకు భూములకు రహదారి సౌకర్యం కల్పించారు. ఈ మేరకు కొండపైన ఉన్న భూములను ప్రొక్లెయిన్‌తో చదును చేసి రహదారి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విఆర్‌ఒ పాలవలస శ్రీనివాసరావు, వికలాంగుల సంక్షేమ అధ్యక్షుడు సహదేవుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మోజీకి శ్రీశ్రీ పురస్కారం

రణస్థలం: అమ్మోజీ సాహిత్య, సామాజిక సేవలు ప్రశంసనీయమని శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. అనకాపల్లిలో నిర్వహించిన శ్రీశ్రీ కళావేదిక 139వ జాతీయ కవి సమ్మేళనంలో ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రతాప్ మాట్లాడుతూ చిన్న ఉద్యోగం చేసుకుంటూ ముగ్గురు అనాథ బాలికలను దత్తత తీసుకుని చదివించడం గొప్ప విషయమన్నారు. వృత్తితో పాటు ప్రవృత్తిలోనూ రాణిస్తూ సాహిత్యం, సమాజసేవలోనూ తనదైన ముద్ర వేసుకుంటోందన్నారు. అమ్మోజీ కలం పేరు 'అమ్మురీ'తో రచనలు చేస్తున్నారు. ఇందుకు కన్వీనర్ కొల్లి రమావతి, చైర్మన్ ప్రతాప్ చేతులమీదుగా శ్రీశ్రీ సేవా పురస్కారం అందజేశారు. టెక్కలి మండలం పోలవరానికి చెందిన అమ్మోజీ రణస్థలం మండలం కోష్ట సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు.

పలువురికి ఆర్థికసాయం

పోలాకి: పోలాకి గ్రామానికి చెందిన ఆటో నడుపుతూ జీవనం సాగించే భైరి జయరాం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కూలి పని చేసుకుంటూ తన భర్త వైద్యం కోసం, ఇద్దరు పిల్లలతో బతకటానికి అతని భార్య కష్టపడుతుంది. విషయం తెలుసుకున్న పోలాకి గ్రామస్తులు మేమున్నామంటూ రూ.50 వేలు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవలే మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన డోల కాళిదాసు కుటుంబానికి రూ.45 వేలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మజ్జి లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు, వల్లంనాయుడు మాస్టారు, ఈసర్ల శ్రీధర్ నాయుడు, రెంటికోట త్రినాథరావు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీధర్

శ్రీధర్‌కు ప్రశంసలు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం సర్పంచ్ ప్రతినిధి, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మాలతి శ్రీధర్ ప్రశంసలు అందుకున్నారు. టిడిపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ఆయనన సేవలను టిడిపి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పార్టీ నుంచి ప్రశంసాపత్రం మండల కేంద్రానికి చేరుకుంది. దీనిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తనయుడు సాయి గణేష్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి చలాన శరత్ కుమార్, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి ఎన్.వెంకటరావు, ఆళ్ల శంకర్ పాల్గొన్నారు.


దళితులతో మాట్లాడుతున్న దుర్గారావు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని బెండి పంచాయతీ దళిత కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని జనసేన సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నివాస గృహాల్లోకి నీరుచేరడంతో దళితులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న దుర్గారావు జనసేన నాయకులు వంశీకృష్ణ చౌదరి, నీలాచలంతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా దళిత కాలనీ వాసుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసన వర్షాలకు నీరు నివాసగృహాల్లోకి చేరాయని వారు తెలిపారు. రోడ్డు ఎత్తుగా ఉండడం, డ్రెయినేజీ లేకపోవడంతో నీరు బయటకు వెళ్లే దారి లేక ఇళ్లల్లోకి చేరుతుందని వివరించారు. డ్రెయినేజీ, కాలువల నిర్మాణాలకు తీర్మానం చేస్తామని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నారాయణ తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కస్తామన్నారు. దళిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, దళితుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

అక్కడ తీశారు.. ఇక్కడ వేశారు

పారిశుధ్య నిధులు దుర్వినియోగం

ప్రజాశక్తి- ఆమదాలవలస


రహదారి పక్కన వేసిన సిల్ట్

పురపాలక సంఘంలోని 23 వార్డుల్లో పారిశుధ్య కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను కొద్ది రోజులుగా గుత్తేదారులు తొలగిస్తున్నారు. అయితే కాలువల్లో తొలగించిన సిల్ట్‌ను కొద్దిరోజులు కాలువ గట్లపై ఉంచి ఆ తరువాత సిల్ట్‌ను ఒకటవ వార్డు పరిధిలో ఉన్న చెత్త కేంద్రానికి తరలించకుండా పట్టణ శివారులో ఏదో ఒక చోట పార వేస్తుండడంతో ప్రజలు గుత్తెదారులు, పురపాలక సంఘ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఐజె నాయుడు కాలనీ, లక్ష్ముడుపేటకు వెళ్లే రహదారిలో ఉన్న పిల్ల కాలువ పక్క సిల్ట్‌ను పడవేయడంతో పలువురు సన్న, చిన్నకారు రైతులు, అదే రహదారిలో ప్రయాణిస్తున్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2000లో అప్పటి పాలకులు సుమారు రూ.70 లక్షలతో 40 అడుగుల మట్టి రహదారిని పాలకొండ రోడ్డు నుంచి ఇటు ఐజె నాయుడు కాలనీ, కృష్ణాపురం వరకు నిర్మించారు. పురపాలక సంఘంలోని డెబ్రిస్ సిల్ట్ తదితర వ్యర్థపదార్థాలన్నీ ఇదే రహదారిపై పిల్ల కాలువ వెంబడి పడవేయడంతో రహదారి కుచించుకుపోయి రాకపోకలకు కష్టతరమవుతుందని పలువురు వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో నిధులను మంజూరు చేసి సిల్టును తొలగిస్తున్నప్పటికీ గుత్తేదారులు, పురపాలక సంఘ అధికారుల తీరుతో పారిశుధ్య నిధులు పూర్తిస్థాయిలో సద్వినియోగం కాక దుర్వినియోగం అవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బాధ్యతారాహిత్యంగా అధికారులు


ఇటీవల ఎమ్మెల్యే ఆదేశాలతో పిల్ల కాలువల్లో రూ.90 వేలతో పూడికలు తీయించారని, అదే కాలువ ఒడ్డున కాలువల్లో తొలగించిన సిల్టును పడవేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పిల్ల కాలువలోకి జారి పోయిందని, తద్వారా పంట పొలాలకు నీటి వేగం తగ్గిందని పలువురు రైతులు చెబుతున్నారు. గుత్తేదారు పారిశుద్ధ్య కాలువల్లో తొలగించిన సిల్టును చెత్త కేంద్రానికి తరలించే వరకు పర్యవేక్షించాల్సిన పురపాలక సంఘ అధికారులు చూసి చూడనట్టుగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘ అధికారుల తీరు ఒకరికి మోదం మరొకరికి ఖేదంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పిల్ల కాలువ పక్కన వేసిన సిల్ట్ తదితర వ్యర్థాలను అక్కడ నుంచి తొలగించి రైతులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను పలువురు కోరుతున్నారు.

సందడిగా వినాయక నిమజ్జనం

పొందూరు: పట్టణంలోని గాంధీనగర్-2 వీధిలో ఆదివారం యువత కేరింతలు, డాన్సులతో వినాయక నిమజ్జనం సందడిగా చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహి ంచిన లడ్డు వేలం పాటను డి.సూరిబాబు రూ.7,100కు కైవసం చేసుకున్నారు. సత్యనారాయణ రెడ్డి, కార్తికేయ ట్రెండ్స్ యూత్ సభ్యులు, పురోహితులు వాసు పాల్గొన్నారు.

జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి : పాఠశాలల స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా టెక్కలి నియోజకవర్గం నుంచి జిల్లా జట్టు ఎంపిక ప్రక్రియ స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రగ్బీ, నెట్‌బాల్, స్కిప్పింగ్, విభాగాల్లో ఎంపికలు చేపట్టారు. జిల్లా స్కూల్‌గేమ్ కార్యదర్శి బి.వి.రమణ పర్యవేక్షణలో ఈ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమని అన్నారు. నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాడాన నారాయణరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎంపికల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, ఆదిశేషు, లక్ష్మణరాజా, నాగళ్ల రమేష్, కుప్పిలి ప్రకాష్, జగదీష్, వెంకటరమణ, ఆలివేణి, సీతయ్య, నర్మద, కాపల రఘునాథరావు, పి.వి.రమణ పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొత్తూరు : మండలంలోని దిమిలికి చెందిన వైసిపి నాయకులు దారపు శంకరరావు తల్లి తవిటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మృతురాలి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈమె వెంట చింతాడ సూర్యనారాయణ, సీపాన అశోక్, జగన్, యుగంధర్, రామకృష్ణ, నాగరాజు, సతీష్ ఉన్నారు.


మాట్లాడుతున్న అనురాధ

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనురాధ, కె.హేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు హిరమండలం మండలం సుభలయ ప్రాజెక్టు యూనియన్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు లబ్ధిదారులకు అవసరమైన సరుకులు సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేంద్రా అద్దెలు, కూరగాయల బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన పాలు, గుడ్లు సరఫరా చేయాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. సమావేశంలో రజని, శ్రీలత, శ్రీదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రహదారి బురదమయం

ప్రజాశక్తి- పొందూరు

బురదమయమై అధ్వాన్నంగా ఉన్న రహదారిని దాటేందుకు యువతులు తీవ్ర అవస్థలు పడుతున్న ఈ దృశ్యం మండలంలోని తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు పోయే రహదారి. తాడివలస పిహెచ్‌సికి వెళ్లే రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి ఈ రహదారే ఆధారం. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు గుంతలమయమై, బురదమయమై అధ్వానంగా మారిన ఈ రహదారిలో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటుంది. ఆస్పత్రికి వెళ్లే సమయంలో రోగులు, సిబ్బంది అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదంటూ ఆస్పత్రి సిబ్బందితో పాటు పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా ఆస్పత్రికి వెళ్లే గర్భిణులు, వృద్ధులు, మహిళలు చాలా అవస్థలు పడాల్సి వస్తుందని పలువురు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సిబ్బందితో పాటు, పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


రహదారిపై ప్రయాణానికి అవస్థలు పడుతున్న ఆస్పత్రి సిబ్బంది

రక్తదానానికి ముందుకు రావాలి

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మనిషి ప్రాణాలను నిలిపే రక్తం ప్రాణాపాయ స్థితిలో సకాలంలో అందక చనిపోతున్నారని, అటువంటి సమయాల్లో రక్తమిచ్చిన దాత ప్రాణదాతలుగా నిలుస్తారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న కళింగ భవన్‌లో అక్షయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబారాన్ని ఆయన ప్రారంభించారు. శరీరంలోని కొన్ని అవయవాలను కృత్రిమంగా తయారు చేసి ప్రాణాలు నిలిపే అవకాశాలు ఉన్నాయని, రూ.కోట్లు ఖర్చు చేసినా కృత్రిమంగా రక్తం తయారీకి వీలుండదన్నారు. క్షతగాత్రుల ప్రాణాలను కాపాడటానికి అవసరమైన రక్తాన్ని దాతల నుంచి మాత్రమే సేకరించాలన్నారు. సకాలంలో రక్తదానం చేయడానికి ప్రతిఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలన్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు, 50 కేజీల బరువుకు మించి ఉన్న వారు రక్తదానం చేయవచ్చన్నారు. గతంతో పోల్చితే రక్తదాతల సంఖ్య పెరిగిందని, అయితే రక్తం కొరత రోజురోజుకు తీవ్రమవుతుందన్నారు. అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనాథలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ, ప్రకృతి విపత్తుల సమయంలో స్వచ్ఛందంగా స్పందించి సేవలు అంది స్తుండడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పైడి వేణుగోపాలం, డాక్టర్ పొట్నూరు సూర్యం, అప్పల నాయుడు, బుడుమూరు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ముందు పదే పదే ప్రస్తుతం అమలులో ఉన్న గ్యారంటీ పెన్షన్ పథకంపై ఉద్యోగులంతా అసంతృప్తితో ఉన్నారని అందుకు ప్రస్తుతం ఉన్న గ్యారంటీ పెన్షన్ పథకం ఉద్యోగులకు పదవీవిరమణ అనంతరం వారి బ్రతుకులకు భరోసాగా లేదని అందుకే గ్యారంటీ పెన్షన్ పథకాన్ని సమీక్షించి మెరుగైన పెన్షన్ విధానాన్ని ప్రవేశపెడతామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం దీనిపై ఎందుకు మాట్లాడడం లేదని ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని క్రాంతి భవన్‌లో ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశంలో హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ పథకం లోపబూయిష్టంగా ఉందని అందులో ప్రతిపాదించిన 50 శాతం పెన్షన్‌కు ఎలాంటి గ్యారంటీ లేదన్నారు. తమది మంచి ప్రభుత్వం అని ప్రచారం చేసుకునే కూటమి జిపిఎస్‌ను రద్దు చేసి అక్టోబర్ 1 నుంచి పాతపెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది పని సర్దుబాటులో ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను, భాషా పండితులను మిగులుగా చూపించారని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆయా స్కూళ్ల మూసివేతకు ఇది పన్నాగమని విమర్శించారు. ప్రాథమికోన్నత పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోకపోతే ఎస్‌టియు ఆధ్వర్యాన పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తమ్మినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల సముదాయాల రీ ఆర్గనైజేషన్ పేరిట క్లస్టర్ పాఠశాల వ్యవస్థను తీసుకొస్తున్నారన్నారు. దీనివలన ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు కుట్ర కోణం దాగి ఉందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రతినెల 1న జీతాలు జమ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు పి.రామకృష్ణ, రాధాకృష్ణ, రామారావు, జి.రమణ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్


మాట్లాడుతున్న రాజేశ్వరరావు

సిలబస్ భారం తగ్గించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో సాంఘిక శాస్త్ర విజ్ఞానం ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి దోహదపడుతుందని, అయితే సిలబస్ పెంచడం వలన తలకుమించిన భారంగా మారిందని ఎపి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భవన్‌లో ఫోరం సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు తులగాపు కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నైతిక విలువలు జోడించి బోధించడం వలన నవ సమాజ నిర్మాణానికి తోడ్పడుతుందన్నారు. ప్రతి పాఠశాలకు సాంఘిక శాస్త్ర ప్రయోగశాలను కేటాయించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తులగాపు కేశవరావు, బాడాన రాజు మాట్లాడుతూ సాంఘిక శాస్త్రంలో సిలబస్ భారం తగ్గించాలని, లేనట్లయితే విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఇద్దరేసి ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫోరమ్ ఆధ్వర్యాన నిర్వహించ బోయే సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంఘిక శాస్త్ర దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.అన్నాజీరావు, పి.వి.ఆర్.మూర్తి, టి.రమణ సిహెచ్.సుబ్బలక్ష్మి, ఎస్. స్వప్న, బి.ముకుంద రావు, కె.సంతోష్ కుమార్, జి.గోపాలరావు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి- పలాస

క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలాస ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. డిగ్రీ కళాశాలలో ఆదివారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఇటీవల చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులు భావిభారత పౌరులన్నారు. ప్రతిఒక్క విద్యార్థీ ఏదో లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని ఆ లక్ష్యాలను సాధించే దిశగా ఇప్పటి నుంచే ప్రయత్నించాలన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. గతంలో అనేక విజయాలను సాధించిన విద్యార్థులకు మెడల్స్, వివిధ కోర్సుల్లో ఉన్నత విజయాలను సాధించిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఉజ్వల భవిష్యత్ కోసం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అద్యాంతరం అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, పీడీ డాక్టర్ పి.మధు, ఐక్యూ ఎపి కో-ఆర్డినేటర్ వెంకటరమణ, గ్రంథాలయాధికారి బి.నర్సింహులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

శిథిలావస్థలో రేవు అంపలాం వంతెన

భయాందోళనలో ప్రయాణికులు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో అంపలాం పంచాయతీలో రేవు అంపలాం వద్ద వంశదార కాలువపై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, దానిపై రాకపోకలు సాగించేందుకు భయాందోళనగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మాణం చేసి ఎన్నోఏళ్లు గడిచాయి. శిథిలావస్థకు చేరుకుని సుమారు 20 ఏళ్లు అవుతోంది. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ వంతెనపై నుంచి అంపలాం, రేవు అంపలాం, పల్లిపేట, రాజారాంపురం, కంబాళివానిపేట, అక్కువరం, పరపతివాని పేట, కొవిరిపేట, కొత్తరేవు, సత్రవుపేట, డిఎల్ పురం, జోగంపేట, గుల్లవానిపేట, గుప్పిడిపేట, పెద్దకొయిరిపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలన్నా, నరసన్నపేట వెళ్లాలన్నా ఈ వంతెనపై నుంచి వాహనాల ద్వారా రాకపోకలు సాగించాల్సి ఉంది. అయితే వంతెనపై ప్రయాణిస్తే ఏ క్షణమైనా కూలి పోతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన పున: నిర్మాణం చేపట్టాలని స్థానికులు యోగి, రమణ, పాపారావు, పి.రామారావు, కోడ తాతారావు, పోలీసు, యర్రయ్య తదితరులు కోరుతున్నారు.


రేవు అంపలాం వద్ద శిథిలావస్థకు చేరుకున్న వంతెన
(ఇన్‌సెట్‌లో శిథిలావస్థలో వంతెన గోడ)

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి- పాతపట్నం


రామయ్య మృతదేహం

మండలంలోని అంతరాబలో ఉన్న స్టూడెంట్ కాలనీ వీధిలో కమ్మకట్ల రామయ్య (83) అనుమానాస్పద మృతిపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామయ్యకు పరపతి లక్ష్మి, ధర్మాన పద్మావతి, సుగ్గు పుష్పలతరెడ్డి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి. రామయ్య భార్య మృతి చెందడంతో గత కొంతకాలంగా ముగ్గురు కుమార్తెలు ఆయన యోగక్షేమాలు చూసుకుంటూ వచ్చారు. ఇటీవల తన మూడో కుమార్తె పుష్పలతరెడ్డి అత్తవారి గ్రామం వంబరవల్లి తీసుకెళ్లింది. తన తండ్రి ఆస్తి మొత్తాన్ని తానే కాజేయాలని చూస్తుందని గ్రహించిన లక్ష్మి, పద్మావతులు చెల్లెపై ఇటీవల కోర్టులో కేసు వేశారు. ఈ క్రమంలో ఈ నెల 28న రామయ్యకు ఆరోగ్యం బాగోలేదని శ్రీకాకుళం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందినట్లు అక్కలకు పుష్పలతరెడ్డి తెలియజేసింది. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం అంతరాబకు తీసుకెళ్లారు. తన తండ్రి ఎలా చనిపోయాడో చెప్పాలని ఇద్దరు అక్కలు చెల్లెని ప్రశ్నించారు. అనంతరం రామయ్య మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు.

బాణసంచాతో వ్యక్తి అరెస్టు

కోటబొమ్మాళి: మండలంలోని కురుడుకు చెందిన పంచిరెడ్డి రమణ అక్రమంగా మందుగుండు సామగ్రిని నిల్వ ఉంచారని, వాటిని స్వాధీనం చేసుకుని రమణను అరెస్టు చేశామని ఎస్ఐ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేయగా, రమణ ఇంట్లో దాచి పెట్టిన సామగ్రి లభించిందన్నారు. దీని విలువ రూ.4 వేలు ఉంటుందని తెలిపారు. అయితే ఈ సామగ్రి దీపావళికి తన సొంత వినియోగం కోసం తెచ్చుకున్నాని రమణ చెప్పారని, అయితే అక్రమంగా విక్రయించేందుకే తెచ్చుకున్నారని సమాచారం అందిందని ఎస్ఐ తెలిపారు.

'తెప్పల'కు పురస్కారం

ప్రజాశక్తి- పలాస

పలాసకు చెందిన రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి శ్రీశ్రీ కళావేదిక పురస్కారాన్ని శనివారం రాత్రి అందుకున్నారు. కృష్ణమూర్తి 'మహోన్నతం మన సంస్కృతి' అను కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో ఐఎస్ఒ గుర్తింపు పొందిన ప్రపంచంలో అతి పెద్ద సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన 139వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శాస్త్రి చేతుల మీదుగా దుశ్శాలువ కప్పి సన్మానించి పురస్కారం, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యాంత్రిక జీవన విధానంతో ప్రతిఒక్కరు ఒత్తిడితో జీవనాన్ని సాగిస్తున్నారని, దీనివలన రోగాల బారిన పడుతున్నారని సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత, లైన్స్‌క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం అధ్యక్షులు డా.బొడ్డేపల్లి సురేష్, ఉన్నతి ఆస్పత్రి అధినేత డా.బాడాన దేవభూషణ రావు అన్నారు. ఆదివారం మండలం కళ్లేపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రపంచ హృద్రోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జీవించే ప్రజలకు తగిన శారీరక శ్రమ ఉంటుందని, వారు ఆహారపు అలవాట్లు, వ్యసనాల వలన రోగాలకు గురవుతున్నారన్నారు. అతిగా మద్యం సేవించడం, పొగతాగడం వంటి వ్యసనాలను మానుకోవాలన్నారు. అప్పుడే గుండె పదిలంగా ఉంటుందన్నారు. ఈ శిబిరంలో సన్‌రైజ్, ఉన్నతి ఆస్పత్రుల సిబ్బంది, కళ్లేపల్లి గ్రామ పెద్దలు గంగు నరేంద్ర కుమార్, బన్న కిశోర్ పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న బరంపురం ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి

రూపక్ రెడ్డికి నివాళి

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కవిరాజు రెడ్డి తనయుడు కీర్తిశేషులు రూపేక్‌రెడ్డి సంస్మరణ సభ ఒడిశా రాష్ట్రం పితాతొలిలో ఆదివారం నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు ఒడిశా రాష్ట్రం బరంపురం ఎంపీ ప్రదీప్ పానిగ్రాహి, చీకటి ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సామంత్రాయ్, ఇచ్ఛాపురం వైసిపి నాయకులు నర్తు నరేంద్రయాదవ్‌లు పాల్గొన్నారు. ముందుగా రూపక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాదరావు, తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీరాం, 12వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బుద్దేపు త్రినాథ్‌రెడ్డి, ఖగపతి రెడ్డి, చంద్రయ్య, రాజు, నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

భవనాల నిర్మాణాలకు చర్యలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్‌లో నూతన బస్టాండ్, నూతన ఎన్ఎసి భవన నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి అన్నారు. ఈ మేరకు ఎన్ఎసి కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నూతన బస్టాండ్‌ను రైల్వే స్టేషన్ దరి వద్ద, ఎన్ఎసి కార్యాలయాన్ని పాత పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. దీనిని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ఎన్ఎసి ఉపాధ్యక్షులు రఘురాం సాహు, కార్యనిర్వహణ అధికారి భాగవత్ సాహు, జెఇ సుస్మా బెహరా, సభ్యులు సిర్ల జానకి, సిర్ల రూన్నీ, సిర్ల ఊర్వశి, ఒమ్మి రాజమ్మ, కళింగపట్నం జీవరత్నం, కొరికాన రాజేష్, దొర్ల సబర్, విమల, టి.చలపతిరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుధారాణి